కేసీఆర్‌తో నల్లగొండ నేతల భేటీ

జూలూరు సంకలనం చేసిన 'అందరికీ అమ్మ' పుస్తకాన్ని ఆవిష్కరించిన కేసీఆర్

ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన బీఆర్ఎస్ నేతలు శనివారం అధినేత కేసీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎర్రవెల్లిలోని నివాసానికి వెళ్లిన నేతలు అధినేతకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కేసీఆర్‌ను కలిసిన వారిలో ఎమ్మెల్సీ కోటిరెడ్డి, మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, రమావత్ రవీంద్రకుమార్, బొల్లం మల్లయ్యయాదవ్, గొంగిడి సునీతా మహేందర్‌రెడ్డి, గాదరి కిశోర్, నల్లమోతు భాస్కరరావు, కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, పార్టీ సీనియర్ నేతలు బూడిద భిక్షమయ్యగౌడ్, బండ నరేందర్ రెడ్డి, ఎలిమినేటి సందీప్‌రెడ్డి, కంచర్ల కృష్ణారెడ్డి, నర్సింహారెడ్డి, పాల్వాయి స్రవంతి, రేగట్టే మల్లికార్జున్‌రెడ్డి, మందడి సైదిరెడ్డి, చింతల వెంకటేశ్వర్‌రెడ్డి, పల్లె ప్రవీణ్ రెడ్డి, నేవూరి ధర్మేందర్ రెడ్డి, వలమల కృష్ణ, నూకల యుగంధర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

- హైదరాబాద్(నమస్తే తెలంగాణ)



కేసీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్సీ తాతా మధు, మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి

'అందరికీ అమ్మ' ఆవిష్కరణ

తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్ సంకలనం చేసిన 'అందరికీ అమ్మ' పుస్తకాన్ని కేసీఆర్ ఆవిష్కరించారు. తెలంగాణ అస్తిత్వ పతాకగా, రాష్ట్ర సాధన ఉద్యమంలో ఆరాధన పూరితంగా ఉన్న తెలంగాణ తల్లి రూపం, సారం, నేపథ్య అంశాలతో జూలూరు ఆ పుస్తకాన్ని తెచ్చారు. ఈ సందర్భంగా జూలూరు గౌరీశంకర్‌ను కేసీఆర్ అభినందించారు.

సంక్రాంతికి ఇందిరమ్మ ఇండ్లు ఉత్తమాటే!

ఇంకా 40శాతం పూర్తి కావాల్సిన సర్వే • గ్రేటర్ పరిధిలో సర్వేకు మరో15 రోజులు పడుతుందట

హైదరాబాద్, జనవరి 4 (నమస్తే తెలంగాణ): సంక్రాంతికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని ఇటీవల మంత్రి చేసిన ప్రకటన ఆచరణకు నోచుకునే అవకాశాలు కనిపించడం లేదు. ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారి సర్వే జిల్లాల్లో ఇప్పటికి 60 శాతం, గ్రేటర్ హైదరాబాద్‌లో కేవలం 10 శాతం మాత్రమే పూర్తయినట్టు తెలుస్తున్నది. ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ సందర్భంగా ఇందిరమ్మ ఇండ్ల కోసం రాష్ట్రంలో 80 లక్షలకుపైగా దరఖాస్తులొచ్చిన విషయం విదితమే. కేంద్రం అమలుచేస్తున్న పీఎంఏవై పథకంతో కలిపి ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని అమలుచేయాలని ప్రభుత్వం నిర్ణయించడంతో దరఖాస్తుదారుల వివరాలన్నీ పీఎంఏవై యాప్‌లో నమోదు చేయాల్సి వచ్చింది. దరఖాస్తుదారుల సమగ్ర సమాచారం నమోదు చేస్తేనే సదరు యాప్ దరఖాస్తును పరిగణనలోకి తీసుకుంటుంది. దీంతో అధికారులు దరఖాస్తుదారుల ఇంటింటి సర్వే చేపట్టి వివరాలు, వారి ఫోటోలను సేకరిస్తున్నారు. జిల్లాల్లో సైతం ఇప్పటివరకు 60 శాతమే సర్వే పూర్తయింది. సర్వే సిబ్బంది చాలా గ్రామాలకు వెళ్లకపోగా, వెళ్లిన గ్రామాల్లో సైతం డోర్‌లాక్‌లు, ఇతరత్రా కారణాలతో వివరాల సేకరణ జరగలేదని సమాచారం. ఇక గ్రేటర్ హైదరాబాద్‌లో మొత్తం 150 డివిజన్ల పరిధిలో 10.71 లక్షల మంది దరఖాస్తు చేసుకోగా, ఇప్పటివరకు 1.71 లక్షల దరఖాస్తుదారుల వివరాలు మాత్రమే యాప్‌లో నమోదు చేశారు. సర్వే పూర్తిచేసేందుకు ఇంకా 15 రోజులు పడుతుందని గృహనిర్మాణ సంస్థ ఎండీ ప్రకటించారు. ఈ నేపథ్యంలో సంక్రాంతి నాటికి 4.5 లక్షల ఇండ్ల మంజూరు కష్టంగానే కనిపిస్తున్నది.

ఏడాది దాటినా కొలిక్కిరాని ఇళ్ల పథకం

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయింది. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని సీఎం పదేపదే ఎన్నికల ప్రచారంలో ప్రకటించారు. ఆ ఆరు గ్యారెంటీల్లో ఒకట్టైన ఇందిరమ్మ ఇండ్ల పథకం మాత్రం ఇంతవరకు కొలిక్కిరాలేదు. 2023 డిసెంబర్ 28 నుంచి గత ఏడాది జనవరి 6వ తేదీవరకు నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తులు స్వీకరించారు. గత ఏడాది మార్చి 11న సీఎం చేతులమీదుగా భద్రాచలంలో పథకాన్ని ప్రారంభించారు. అనంతరం పార్లమెంటు ఎన్నికల ఫలితాల తరువాత ప్రక్రియ చేపడతామన్నారు. దసరాకు ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటుచేస్తామని ప్రకటించారు. ఇంతవరకు చాలాచోట్ల ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు కాలేదు. దీపావళి కానుకగా ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని మంత్రి ప్రకటించారు. అదికూడా అమలుకాలేదు. సెప్టెంబర్‌లో దరఖాస్తుల పరిశీలన ప్రారంభించి డిసెంబర్ 5న యాప్‌ను ఆవిష్కరించారు. గత నవంబర్‌లో వివరాల సేకరణకు సర్వే చేపట్టగా, ఇప్పటివరకు 60శాతం వరకు సర్వే పూర్తయింది. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా కేంద్ర సహకారంతో లబ్ధిదారులకు నాలుగు దశల్లో 5 లక్షలు చెల్లిస్తామని ప్రభుత్వం ప్రకటించిన సంగతి తెలిసిందే.

అధికారులు రాలేదని ఆందోళన వద్దు: ఎండీ

దరఖాస్తుదారుల ఇండ్లకు వెళ్లి అన్ని వివరాలూ సేకరిస్తామని గృహనిర్మాణ సంస్థ ఎండీ ఒక ప్రకటనలో హామీ ఇచ్చారు. తమ ఇండ్లకు అధికారులు రాలేదని ఎవ్వరూ ఆందోళన చెందరాదని ఆయన భరోసా ఇచ్చారు. దరఖాస్తుదారులు ఎక్కడికీ వెళ్లొద్దని, వచ్చే 15 రోజుల్లో అధికారులే మీ ఇంటివద్దకు వస్తారని స్పష్టంచేశారు. ప్రస్తుతం నివసిస్తున్న ఇల్లు సొంతమా? లేక అద్దె ఇల్లా? ఆ ఇంటిని దేనితో నిర్మించారు? తదితర వివరాలు ఫొటో తీసుకొని యాప్‌లో అప్‌లోడ్ చేస్తామని ఎండీ వివరించారు.

ఇందిరమ్మ ఇండ్ల సర్వే అధికారి సస్పెన్షన్

మహాముత్తారం, జనవరి 4 : ఇందిరమ్మ ఇల్లు కోసం ఒక్కొక్కరి నుంచి రూ.500 చొప్పున వసూలు చేసిన ఇందిరమ్మ ఇండ్ల సర్వే అధికారి టీపీ ప్రసాద్ సస్పెండ్ అయ్యారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండలం దౌత్‌పల్లిలో ఇందిరమ్మ ఇండ్ల సర్వే అధికారి, టెక్నికల్ అసిస్టెంట్ ప్రసాద్ సర్వే కోసం ఇంటింటికీ రూ.500 చొప్పున వసూలు చేశాడని పలువురు బాధితులు గత డిసెంబర్ 31న ఎంపీడీవోకు ఫిర్యాదు చేయగా, ఈ నెల ఒకటిన 'నమస్తే తెలంగాణ'లో 'పైసలిస్తేనే ఇందిరమ్మ ఇల్లు' అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం స్పెషల్ అధికారి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో అధికారులు గ్రామంలో విచారణ చేపట్టారు. ఇంటింటికీ తిరుగుతూ ఎన్ని డబ్బులు ఇచ్చారు? ఎంతమంది ఇచ్చారు? అని బాధితులను అడిగి తెలుసుకొని కలెక్టర్‌కు నివేదించారు. ఆ మేరకు సర్వే అధికారి టీపీ ప్రసాద్‌ను సస్పెండ్ చేశారు.

మీ కడుపు నిండితే చాలా?

- **నిరుద్యోగుల ఆకలి తీరిందా?**
- **ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్**

హైదరాబాద్, జనవరి 4 (నమస్తే తెలంగాణ): రూ.32,000 ప్లేటు మీల్స్‌తో మంత్రులకు కడుపు నిండితే చాలా? నిరుద్యోగుల కుటుంబాలు ఆకలితో అలమటించినా పట్టించుకోరా? అని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ప్రశ్నించారు. ప్రజాప్రభుత్వం మరీ ఇంత బిజీనా? నియామక పత్రాలు ఇవ్వడానికి కూడా సమయం లేదా? అని శనివారం ఎక్స్ వేదికగా రేవంత్‌రెడ్డి సర్కారును నిలదీశారు. 'అయ్యా.! డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క గారు.. దయచేసి కొంచెం ఉత్తర తెలంగాణ విద్యుత్తు పంపిణీ సంస్థ (టీజీ ఎన్పీడీసీఎల్)లో జూనియర్ అసిస్టెంట్, కంప్యూటర్ ఆపరేటర్ అభ్యర్థులకు నియామక పత్రాలు ఇవ్వడానికి కొంచెం సమయాన్ని కేటాయించండి. జెన్‌కోలో ఇంజినీర్లు, కెమిస్టులుగా ఎంపికైన అభ్యర్థులు నియామక పత్రాల కోసం మూడు నెలలుగా రోజూ చకోర పక్షుల్లా భిక్షాటన చేస్తున్నారు. వాళ్లేం పాపం చేసిండ్రు? ప్రజాప్రభుత్వం మరీ ఇంత బిజీనా? నియామక పత్రాలు ఇవ్వడానికి కూడా ముహూర్తాలు కావాలా?' అని ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ చురకలు అంటించారు.

'హెచ్ఎంపీవీ'తో ప్రమాదం లేదు: డీహెచ్ రవీందర్

హైదరాబాద్, జనవరి 4 (నమస్తే తెలంగాణ): హ్యూమన్ మెటాన్యుమో వైరస్ (హెచ్ఎంపీవీ) ప్రమాదకారి కాదని డీపీహెచ్ రవీందర్ నాయక్ తెలిపారు. సాధారణ జలుబుతోపాటు శీతాకాలంలో వచ్చే ఇతర లక్షణాలు కలిగిస్తుందని, దీని గురించి పెద్దగా భయపడాల్సిన అవసరం లేదని శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పటి వరకు రాష్ట్రంలో ఎక్కడా హెచ్ఎంపీవీ కేసులు నమోదు కాలేదని తెలిపారు.